క్లుప్తంగా

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి



ప్రత్తికోళ్లలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు రూరల్ : మలేరియా జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా శనివారం ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంకలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పరిసరాల్లో మంచినీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో మలేరియా కారక దోమ పెరుగుతుందన్నారు. ప్రజలు అప్రమత్తమై మంచినీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను మట్టితో నింపాలని సూచించారు. మలేరియా జ్వరం వచ్చిన బాధితులు వెంటనే వైద్య సేవలు పొందాలన్నారు. లేకుంటే మెదడకు చేరి ప్రాణాపాయ స్థితికి చేరుతారని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ శేషావతారం, ఏఎస్ఎం మహాలక్ష్మి, హెచ్ఏ మురళి, శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాగు పట్టాలు మంజూరు చేయాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న దళిత సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): గుట్ట పోరంబోకు, పోరంబోకు, గయ్యాలి, పోడు, అటవీ భూములు సాగు చేసుకుని జీవించే దళిత వెనుకబడిన వర్గాల రైతులకు సాగు పట్టాలు మంజూరు చేసి రైతు భరోసా వర్తింపజేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు రైతు భరోసా వర్తింపజేయడం ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత సేన ఏలూరు జిల్లా కార్యదర్శి పిరంగుల ఇదియా, నాయకులు విస్సన్నపల్లి సురేష్, బుల్లా రవి కుమార్, పింగుల విజయమ్మ, యలమర్తి నాగయ్య, లక్కపాము దాసు, లక్ష్మీకాంతం, సరోజని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని వివిధ ఆలయాల్లో స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి వారికి నిత్య పూజలు, విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక దక్షిణపు వీధి మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి కల్యాణ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఆలయంలో నిత్య హోమాలు, బలిహరణ పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలోని హైమావతి సమేత మార్కండేయ స్వామి వారికి త్రయాహ్నిక దీక్షతో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కనమర్లపూడి జనార్ధనరావు, స్థానిక కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు కందుకూరి కన్నబాబు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.



పవర్‌పేటలోని విశ్వేరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో కల్యాణ మూర్తులు



మార్కండేయ స్వామి వారి కల్యాణ మహోత్సం నిర్వహిస్తున్న అర్చకులు

రైళ్ల ప్రమాదానికి కేంద్రానిదే బాధ్యత



వైఎంహెచ్ఏ సెంటర్లో ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఒరిస్సాలో కోరమాండల్, యశ్వంత్ పూర్ రైళ్ల ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రైల్వే ప్రైవేటీకరణే ప్రమాదాలకు ప్రధాన కారణమని, మరణించిన వారికి రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాల్ సెంటర్లో శనివారం సాయంత్రం ధర్నా చేశారు. రైల్వే ప్రమాదానికి బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిచే సమగ్ర విచారణ చేయించాలని, రైల్వే గ్యాంగ్‌మెన్‌ల సంఖ్యను పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి రైల్వే ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. క్షత గాత్రులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రైవేటు కాంట్రాక్టు వ్యవస్థ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ, ప్రజల యోగ క్షేమాలను భద్రతను రక్షణను పట్టించుకోవడం లేదని, ఈ నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగిందని విమర్శించారు. రైల్వే ప్రైవేటీకరణ విధానాలను కేంద్రం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావు, నాయకులు డి.వీరినాయుడు, మంగం అప్పారావు, బి.వీరభద్రం, రాచీటి జాన్, సాయి అన్నవరం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా మహిళా కార్మికుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న వంగూరు గౌతమి ఫ్యాక్టరీ మహిళా కార్మికులు

ఏలూరు (టూటౌన్): మహిళా మల్ల యోధులను లైంగికంగా వేధించిన దోషులను కాపాడుతోన్న మోదీ, షాల ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏలూరు సమీపంలోని వంగూరు గౌతమి ఫ్యాక్టరీ మహిళా కార్మికులు శనివారం ధర్నా చేశారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ గత ఏప్రిల్ 23 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తోన్న మహిళా మల్ల యోధులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులు చేయడాన్ని ఖండించారు. ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా మల్ల యోధులు న్యాయం కోసం పోరాడుతుంటే మోదీ, షాల ప్రభుత్వం నేరస్తులను కాపాడుతోందని విమర్శించారు. బేటీ బచావో – బేటీ పడావో అంటే ఇదేనా అని ప్రశ్నించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చి బంగారు పతకాలు సాధించిన మహిళా మల్ల యోధులను లైంగికంగా వేధించిన వారిని అరెస్టు చేయకుండా దేశ పరువును ప్రపంచంలో మంట గలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో నిరసన చేపట్టిన వారిపై లాఠీచార్జి చేసి, అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.పద్మ, నాయకులు ఆలిసమ్మ, రాణి, బి.పద్మ, లిల్లీ పుష్ప, రంగమ్మ, మోతి భవాని, రమణమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీతారాం

ఏలూరు (టూటౌన్) : పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఏలూరు జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది జూలైలో గోదావరికి వచ్చిన వరదల నుంచి ప్రజలు ఇంత వరకు కోలుకోలేదన్నారు. రానున్న వర్షాకాలంలో మరోసారి గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం పొంచి ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పోలవరం ప్రాంతంలోని 8 మండలాల ప్రజలు అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక అడవుల్లో చెట్టు, పుట్టలపాలై బతుకుతున్నారని వాపోయారు. కేంద్రం ఏజెన్సీ గిరిజనులకు ఎలాంటి సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేసిందని, పునరావాసానికి నిధులు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చిందన్నారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకు పూర్తి స్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో చెరువులు, గుంతలు అక్రమంగా తవ్వి మట్టి, ఇసుక రవాణా చేస్తున్నారని దీనిని అరికట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకట్రావు, వై.నాగేంద్రరావు, ఎ.శ్యామలరాణి,ఎ.ఫ్రాన్సిస్, తుమ్మల సత్యనారాయణ, తెల్లం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ అటానమస్ హోదా పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి కళాశాలకు అటానమస్ హోదాను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మరో పదేళ్లు పొడిగించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల 1987వ సంవత్సరం నుంచి స్వయం ప్రతిపత్తి హోదా కలిగి ఉందని, ప్రతి ఐదేళ్లకోసారి కళాశాల ప్రమాణాలను సమీక్షించి యూజీసీ అటానమస్ హోదాను గ్రాంట్ చేస్తుందని వివరించారు. ఈ మేరకు తమ కళాశాల వరుసగా 2005, 2011, 2017, 2022 సంవత్సరాల్లో నాక్ ఏ గ్రేడ్ పొందడం వల్ల గత నెల 26న జరిగిన సమావేశంలో తమ కళాశాలకు 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2031-32 విద్యా సంవత్సరం వరకు స్వయం ప్రతిపత్తి హోదాను గ్రాంట్ చేసినట్టు వివరించారు. ఈ ఘనత సాధించడానికి నిరంతరం కృషి చేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి ఇంద్రకుమార్, ఎంబీఎస్‌వీ ప్రసాద్, కరస్పాండెంట్స్ కేఎస్ విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగాలకు 6న ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం, సెట్‌వెల్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో ఈనెల 6న ఉదయం 10.30 నుంచి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేరియంట్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయుల నియామకానికి బీఈడీ, డీఈడీ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు ఉండి 19 నుంచి 40 సంవత్సరాలు వయస్సు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. మ్యాక్స్ సెక్యూరిటీలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు 10వ తరగతి పాసయి ఉండి ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవర్ ఉద్యోగానికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 సంవత్సరాలు మధ్య ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 88868 82032.91827 72465, 77999 27615లో సంప్రదించాలని వివరించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి బుల్లికృష్ణ

ఏలూరు (టూటౌన్): జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లికృష్ణ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ఈ నెల రోజుల పాటు వ్యాపార సంస్థలు, దుకాణాలు, కర్మాగారాల్లో తనిఖీలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ సూర్యచక్రవేణి, ప్యానల్ లాయర్లు కె.కృష్ణారావు, జీవీ భాస్కరరావు, కట్టా సత్యనారాయణ, ఎన్జీఓ మేతర అజయ్ బాబు, సిడబ్ల్యూసి మెంబరు పి.వెంకటేవ్వరరావు, దిశా సీఐ ఇంద్ర శ్రీనివాసరావు, పారా లీగల్ వాలంటీర్స్, చైల్డ్ లైన్, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో మున్సిపల్ రాష్ట్ర ప్రచార యాత్ర

ఏలూరు (టూటౌన్): ఈనెల 4, 5 తేదీలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మున్సిపల్ రాష్ట్ర ప్రచార యాత్ర కొనసాగుతుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని, ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర జాతా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో మే 31న ప్రారంభమైందని పేర్కొన్నారు. యాత్ర ఈనెల 4న ఉదయం కొవ్వూరులో ప్రవేశిస్తుందని, 5న సాయంత్రం 7 గంటలకు ఏలూరులో ముగుస్తుందని తెలిపారు. యాత్రలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-08
బెండకాయలు	32	కంద	54
పచ్చిమిర్చి	36-40	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	--	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	27
ఏలూరు -తిరుపతి	16.00	4830	30


'అన్నదాతకు అండగా నిలిచాం'



ప్రభుత్వం నుంచి అందిన పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: అన్ని వర్గాలతోపాటు అన్నదాతకు అండగా నిలిచామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలో ఆయన శనివారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద దెందులూరు నియోజకవర్గంలో 26,827 మంది రైతులకు రూ.17 కోట్ల పైగా నగదును అందించామని ఎమ్మెల్యే చెప్పారు. 264 మంది రైతులకు రోటవిటర్లు, హార్వెస్టర్లు, ట్రాక్టర్‌లు, వ్యవసాయ యంత్ర పరికరాలు రూ.8.32 కోట్లు విలువ చేసే వాహనాలు, పనిముట్లు అందించి, రూ.3 కోట్ల సబ్సిడీ ఇచ్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే వివరించారు. ఏఎంసీలో అత్యాధునిక లెమన్ గ్రేడెడ్ మెషీన్‌ను కూడా ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా దాదాపు 750 హామీల మ్యానిఫెస్టోలో ఏ ఒక్క హామీ నెరవేర్చని చరిత్ర చంద్రబాబుదని, ఆయన వచ్చాడంటే వర్షాలు కూడా పడవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ మేకా గంగాధరరావు, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యురాలు చోడిశెట్టి ప్రభావతి, మేకా వసంత్, చోడిశెట్టి వెంకటేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, సొంగ సోమేశ్వరరావు, తాళం వెంకటేశ్వరరావు, సుభాని, మస్తాన్, కాసిం, మోతీ, జగదీష్, పరసా వరలక్ష్మి, పోకల రాంబాబు, పులవర్తిత దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి ఐటీ విభాగం కృషి



మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కుమార్

దెందులూరు: వైఎస్సార్‌సీపీకి వెన్నెముక్కగా ఉన్న ఐటీ విభాగం వచ్చే ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తుందని ఐటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు గూడపాటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్ల సాధనకు ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోసింరెడ్డి సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ వివరాలను శనివారం ఆయన దెందులూరు మండలం పోతునూరులో వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలో అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామ కమిటీలు త్వరలో నియామకం పూర్తి చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి ఐటీ విభాగం విశిష్ట సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి సూచనలు, సలహాలను రాష్ట్ర కమిటీకి వివరించినట్టు చెప్పారు.

క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

దెందులూరు: యువత విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం మేధినరావుపాలెంలో టీ-20 క్రికెట్ పోటీలను ఆయన టాస్ వేసి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ శివారు ప్రాంతాల్లోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడల అభివృద్ధి, ప్రోత్సాహానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.దుర్గాకుమారిరాజు, ఎంపీటీసీ సభ్యుడు అంగడాల వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు, నాయకులు మేడికొండ రాజా, మేధినరావు పాలెం యూత్ పాల్గొన్నారు.

ఆశ్రం వద్ద షెల్టర్, లైట్లు ఏర్పాటు చేయాలి

దెందులూరు: ఆశ్రం జంక్షన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సేవా సంస్థ బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు శనివారం కోరారు. దెందులూరులో ఆయన మాట్లాడుతూ విజయవాడ - రాజమండ్రి ప్రాంతాలకెళ్లే ప్రయాణికులు నిలువ నీడలేకుండా ఇబ్బందులుపడుతున్నట్లు చెప్పారు. రాత్రివేళల్లో లైటింగ్ సౌకర్యం లేక మహిళలు, వృద్ధులు నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు.

సర్వేరాళ్లు పీకేసిన వ్యక్తులపై కేసు

పెదపాడు : మండలంలోని ప్రభుత్వ సర్వేయర్ వేసిన సర్వే రాళ్లను పీకేసిన వ్యక్తులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో గత నెల 31న గ్రామ సర్వేయర్ వేసిన సరిహద్దు రాళ్లను పీకేసి తమ విధులకు ఆటంకం కలిగించారని తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణ చల్లా కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురి ఎంపిక

దెందులూరు: కొవ్వలి హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం ఎస్ఎన్ఎల్‌వీజీ శర్మ తెలిపారు. వీరిలో గోవాడ అనంత సతీష్, గొరిపర్తి సౌమ్య దుర్గారాణి, బీడ జ్యోతి లోహిత్‌కుమార్, పండుల ఉదయ్ కిరణ్, గొల్ల పల్లవి ఉన్నట్టు చెప్పారు. వీరిని అభినందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.